# భాగం 15 కాశ్మీర దీప కళిక (యాత్రా చరిత్ర)

## విషయ క్రమం


**15.0** ఉద్దేశం

**15.1** ప్రవేశిక

**15.2** పాఠ్యం 'కాశ్మీర దీపకళిక' (యాత్రాచరిత్ర)

**15.3** పాఠ్య సారాంశం

**ఆకళింపు ప్రశ్నలు 1**

**15.4** తెలుసుకోదగిన అంశాలు

**ఆకళింపు ప్రశ్నలు 2**

**అభ్యాసాలు చేయండి**

**15.5** ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

**అభ్యాసాలకు మాదిరి జవాబులు**


## 15.0 ఉద్దేశం

నాయని కృష్ణకుమారి రాసిన కాశ్మీర దీప కళిక అనే యాత్రా చరిత్రలోని ఒక భాగం మన పాఠ్యం. ఆ పాఠ్యం ఆధారంగా సాహిత్య శైలీ లక్షణాలను గ్రహించ గలుగుతారు. ఈ భాగం పూర్తి చేశాక యాత్రా రచనల్లో చరిత్ర కథనానికి ఉపయోగించే వచనం కంటే భిన్నమైన కవితావేశంతో కూడిన వచన లక్షణాలను మీరు విశ్లేషించగలుగుతారు.

## 15.1 ప్రవేశిక

ఇంగ్లీషులో ట్రావెలాగ్ (travelogue) అనే పద్ధతిలో తెలుగులో యాత్రాచరిత్రలు కొన్ని వచ్చాయి.

ఏనుగుల వీరాస్వామయ్య (1838) కాశీయాత్ర చరిత్రము, కోలా శేషాచల కవి నీలగిరి యాత్ర (1840) తెలుగులో ప్రసిద్ధ యాత్రా చరిత్రలు. ఈ యాత్రా చరిత్రల్లో రచయితలు తమ ప్రయాణంలో దర్శించిన వింతలనూ, విశేషాలనూ ప్రదర్శించారు. చూసిన ప్రదేశాలనూ అక్కడి

రాజకీయ, సామాజిక విశేషాలనూ ఈ రచయితలు వర్ణించారు. సాంఘిక చరిత్ర నిర్మాణానికీ ఈ యాత్రా చరిత్రలు కొంతవరకు ముడి సరకుగా పనికొస్తాయి.

ఈ భాగంలో ఇచ్చిన పాఠ్యం నాయని కృష్ణకుమారి రచించిన కాశ్మీర దీప కళిక (1979) అనే పుస్తకం నుంచి గ్రహించింది. ఇదికూడా యాత్రా చరిత్రమేకానీ చరిత్రపాలు తక్కువ. సరిఅయిన పేరుపెట్టవలసి వస్తే దీన్ని యాత్రాకావ్యం అనాలి. ఇందులో ఉన్నది వచనంలాగు కనిపిస్తుంది. కాని నిజానికి మామూలుగా చరిత్రకథనానికి ఉపయోగించే వచనం కాదు. ప్రకృతి సౌందర్యానికి పరవశించిన రచయిత్రి కవితావేశంతో చెప్పిన వచనం ఇది. ఇలాంటి వచనాన్ని విషయగ్రహణ కోసం మాత్రంకాక సౌందర్య తృష్ణతో చదువుతారు.

ఉస్మానియా విశ్వ విద్యాలయ విద్యార్థులను కాశ్మీర యాత్రకు 1967 జూన్ నెలలో తీసుకొని వెళ్లారు. ఆ సందర్భంగా రచయిత్రి తమ అనుభవాలను ఒక క్రమంలో ఈ పుస్తకంలో వివరించారు. ఈ యాత్ర విజ్ఞాన యాత్ర అయినా సుందర దృశ్య దర్శనం వల్ల వినోద యాత్రకూడా.

నాయని కృష్ణకుమారి (1930 - ) ఉస్మానియా విశ్వ విద్యాలయ ఆంధ్రభాషా శాఖలో ఆచార్యులు. జానపద గేయగాథలమీద (1977) పరిశోధన చేసి డాక్టరేటు డిగ్రీపొందారు. కవిత్వం, కథ, నాటిక, సాహిత్య విమర్శ, భాషావిమర్శ వంటి వివిధ సాహిత్య (1983) ప్రక్రియల్లో కృషిచేశారు. ఆంధ్రులకథ (1983) అగ్నిపుత్రి (1977 కవితాసంకలనం) పరిశీలన (1978-వ్యాసాలు) పరిశోధన (1979, వ్యాసాలు) వీరి ముద్రిత గ్రంథాల్లో కొన్ని.

ఇపుడు పాఠ్యం చదువుదాం.

## 15.2 కాశ్మీర దీపకళిక (యాత్రా చరిత్ర)

ఆ వేళ జూన్ 18వ తారీకు. ఇల్లువదిలి 5 రోజులు గడిచినట్లు కనిపిస్తోంది. ఇక ఇవ్వాళనుండి కాశ్మీరభూమిలో మనకు నచ్చినవీ, నచ్చనివీ, అందమైనవీ, అందంగాలేనివీ అన్నీ చూసి ఆనందించ చబోతున్నామనే ఊహ తృప్తినిచ్చింది. పదిరోజులపాటు జరగబోయే ఈ పర్యటన కార్యక్రమాన్ని గురించి తలుచుకుంటే ఎక్కడో రవ్వంత నిరుత్సాహం! ఇంత స్వల్పవ్యవధిలో ఇంత సుందర భూఖండాన్ని సర్వాత్మనా తృప్తికరంగా చూడడం ఎలా సాధ్యం? కాని ఇక్కడ చూసేదీ మనసుకు ఆకళింపు తెచ్చుకునేదీ మరుపురానిదిగా చెరగనిముద్ర వేసుకునేదిగా ఉండాలనే బలీయమైన కోరిక లోపల పొంగుతోంది.

ఆ వేళ మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరాం అందరం.

శ్రీనగర్ అందమైన నగరం. విశాలమైన బాటలూ, బాట కిరువైపుల ఎత్తుగా ఏపుగా పెరిగి, నీడనిచ్చే చినార్ చెట్లు! రోడ్ల మీద మనుష్య సమ్మర్దం తక్కువ. ఒక్కో బాటమీద కొంతదూరం ప్రయాణం చెయ్యగానే జీలంనదికాలవల్లో ఏదోఒకటి కంటికి కనపడక మానదు. రోడ్డు కిరువైపులా రకరకాల దుకాణాలు, అందమైన పనితనంతో వెలిగే తోలు వస్తువులూ కుట్టుపని చేసిన గుడ్డలూ పేప సజ్జలూ ఇటువంటివన్నీ ఎక్కడబడితే అక్కడ కనిపిస్తూ ఉంటాయ్. మా కాంప్‌కు దక్షిణంగా చూస్తే పెద్దకొండ. కొండమీద గుడి ఒకటుంది. అదే శంకరాచార్య పర్వతమూ దానిమీద గుడిన్నీ. శ్రీనగర్ భౌతిక స్వరూపపు టెల్లలు అవగతం చేసుకోవాలంటే ఈ శంకరాచార్య పర్వతాన్నధిరోహించాలి. దాదాపు వెయ్యి అడుగుల ఎత్తున్న ఈ కొండమీదనుంచి చూస్తే శ్రీనగర్ అద్భుతంగా మనచుట్టూ చిన్నపిల్లల్ల కోసం సర్దిన బొమ్మల కొలువులా కనిపిస్తుంది. దీనిమీద ఈశ్వరాలయం ఒకటి ఉండేదట. అది క్రీస్తు పూర్వం రెండు వందల ఏండ్లప్పుడు అశోకచక్రవర్తి కొడుకు 'జలకుడు' అనేవాడు ప్రతిష్ఠాపించాడట. ఇప్పుడున్న గుడి జలకుడు కట్టించింది అది, క్రీస్తుపూర్వపు శతాబ్దుల్లో కట్టిన గుడి పడిపోగా ఆరవ శతాబ్దంలో దాన్ని పునర్నిర్మించారట. అది శైథిల్యం చెందగా దాని స్థానంలో వెలిసిందే ఇప్పుడున్న గుడి ఆదిశంకరులు అద్వైత మతస్థాపన చేస్తూ ఇక్కడికివచ్చి కొంతకాలం ఈ పర్వతం మీద నివసించగా దీని కా పేరు వచ్చిందట! దీనిమీద ఎక్కిచూస్తే శ్రీనగరానికి దూరంగా ఉత్తరం వైపు మరోకొండ కనిపిస్తూంది. దీన్ని హరిపర్వతమంటారు. కాశ్మీరాన్ని ఏలిన రాజవంశీకులు దీనిమీద కోటను కట్టించుకున్నారు. ఆ శిథిలాలను మనం ఇప్పటికీ చూడవచ్చు. ఈ రెండు కొండలమధ్యా విస్తరించిన శ్రీనగరంలో అక్కడక్కడా జీలంనదీప్రవాహం సన్నని నీటి చారికల్లా కనిపిస్తుంది. పల్లపు చోట్ల నీరు నిలవఉండి సుందర సరస్సులుగా రూపొందిన వైనం అర్థమవుతోంది. జీలంనదీ ప్రవాహాన్ని దాటడానికి ఊరంతా ఎక్కడ చూచినా వంతెనలు. అందులో మరీ ముఖ్యమైనవి ఏడు. నగరంమొత్తం పడియలు పడియలుగా, మధ్యలో పచ్చని నేల ముక్కలు అతికినట్లు, సన్నని కాలవలు తీసినట్లు, తెల్లగా శుభ్రంగా మెరిసే దారులవెంట బొమ్మరిళ్ళు నిలిపినట్లు వింతగా కనబడుతోంది.

శ్రీనగరంలోకెల్లా ప్రశస్తమైన సరోవరం దాల్ సరస్సు. దాల్ లేక్‌లో నౌకా విహారం చేస్తూ దారిచుట్టూ రమణీయంగా విప్పిన నెమలి పురిలో కన్నులు కుదురుకున్నట్లుగా అమరిన పూల తోటలు చూడడం ఆవేళటి మా కార్యక్రమం. సరస్సులో తిరగడానికి తీరాన నౌకలు సిద్ధంగా ఉన్నాయి. అన్నీ చిన్న చిన్న పడవలు. పైన అందమైన గుడ్డతో కూర్చిన కప్పు, చుట్టూ మన కవసరమైనప్పుడు వేసుకోవడానికి వీలుగా రంగురంగుల పూల పరదాలు,' లోపల కూర్చోడానికి మెత్తని సీట్లు, ముఖ్యంగా స్ప్రింగ్ వరుపుల సీట్లు! ప్రతి బోటువాడూ తన బోటువాడూ తన బోటులో స్ప్రింగ్ వరుపులున్నాయనే విషయం ఘనంగా చెప్పిగాని మరేసంగతి ఎత్తడు, బోటువాడుకాక అందులో ఐదుగురు సుఖంగా కూర్చుని ప్రయాణం సాగించచ్చు. ఆ యజమానుల అభిరుచుల్ననుసరించి ప్రతిబోటుకూ ఓ అందమైన పేరు కన్పించింది. వీటి నక్కడ 'షికారా' లంటారు. మే మెక్కిన షికారా పేరు 'హెలికాప్టర్! దాన్ని నబ్మెరైన్ అంటే బాగుండునేమో అనిపించింది నాకు. దాల్ లేక్ విశాలంగా మాముందు పరచుకుని ఉంది. ఎక్కడ చూసినా **వెండిరేకులా తళతళలాడే నీటి ఉపరితలం** దాల్‌సరస్సు నాలుగుమైళ్ళు పొడవు; వెడల్పు ఒకటిన్నరమైలు. శ్రీ నగరానికి తూర్పుదిశనున్న ఈ సరస్సు కావలివైపున పర్వతశ్రేణి నిటారుగా ఠీవిగా నిల్చుని సరస్సు అందాన్ని తదేకంగా వరికిస్తున్న రసహృదయుడైన వ్యక్తిలా కనిపిస్తుంటుంది. ఆ పర్వత శరీరఛాయ నీళ్ళలో ప్రతిబింబిస్తూ గాఢనీల వర్ణంతో **భాసించే** నీటిలో, ఛాయ వడినంత మేరా నలుపు కలిసిన మరో వర్ణచ్ఛాయను కల్పిస్తోంది. నీళ్ళు నిర్మలంగా ఉన్నయ్. లోపలికిచూస్తే అడుగున నాచు మొక్కలూ తామర కాడలూ కలగాపులగంగా ఇల్లుఊడ్చి మూలపెట్టగా కనిపించే చెత్తలాగా నీళ్ళలోఅల్లల్లాడుతూ కనిపిస్తున్నయ్. నిర్మలంగా అలజడి లేకుండా మెరుస్తున్న జలగర్భాన్ని చీల్చుకుంటూ ముందుకు పోతూంది నావ. ఆ నీటి తుళ్ళింతలకు చుట్టువక్కల చిన్నచిన్న కెరటాలు ఏర్పడి, చూస్తుండగానే దూరంగా తప్పటడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయే వసిపిల్లల చిన్న పాదాల్లా జరిగిపోవడం మొదలుపెట్టాయి. నీరు నిండుగా మనోహరమైన నీలవర్ణంతో భాసిస్తుంది లోపలి నాచుమొక్కలు దట్టంగా కనిపించినచోట ఆ నీలవర్ణం కాఫీరంగుతో కలిసి అందంగా కనవడసాగింది మధ్య మధ్య ద్వీపప్రాయాలయిన నేలచెక్కలు సమీపానికివచ్చి వాటిమీద వచ్చగా ఏపుగా పెరిగిన వావిలిచెట్లు నీటిమీద వంగినవ్పుడు గాఢనీలంతో కలిసిన ఆ ఆకువచ్చని రంగుశోభాయమానంగా కనిపించింది ఆకాశం స్వచ్ఛంగా ఉన్నప్పటి ప్రతిఫలనంలో ఒక అందం! దూరంగా ఉన్న కొండ నీళ్లల్లో తొంగిచూచినప్పుడు, పక్కగాపోయే మరో షికారా నీడ నీళ్ళల్లో హుందాగా కదలాడినప్పుడు, అన్ని సమయాల్లోనూ ఆ వినీల గంభీర సరోవరం మనసులో ఊహావలయాల్ని రేపి ఆకువచ్చనిరంగు శోభాయమానంగా చేసుకోలేని ఆ రమణీయకాన్ని ఆలోచిస్తూ తృప్తి చెందమని ఆదేశించింది. మా వడవ నడిపే వాడు సినిమా పాటలు పాడడం మొదలుబెట్టాడు. గాలి సన్నగా మధురంగా చేసే ఊలతో లయ కలుపుతూ వాడు పాడేపాట మనోజ్ఞంగా కింద నున్న జలతరంగాలను అనుసరిస్తూ పెడలు **పెడలుగా చెవులను తాకు** తోంది. కాలం గడవక ఆగిపోతే! ఈ రమణీయకం ఇలా శాశ్వతంగా కళ్ళముందు ఎటువంటి వికృతత్వమూ పొందకుండా నిలిచిపోతే! ఈ అనంత ప్రకృతి శోభానంవదను అనుక్షణమూ అనుభవిస్తూ ఉండడానికి, ఇప్పుడున్న స్థితిలోనే చలనం లేకుండాఉండి అజరామరమైన అమృతత్వాన్ని పొందగలిగితే! ఎన్ని ఊహలు! నేను పయనించే నీటి మీదికి సూర్యకిరణాలు చల్లగా జారి ఆ నీటి కదలికకు కళ్ళు మెరిసేటట్లు బిళ్లలు బిళ్ళలుగాచెదిరి నలువైపులకూ ప్రసరించినట్లు, నా మెదడులో చకచకా మెరిసే ఊహలు! ఈ ఊహలను వద్దని ఆపగలమా? నిరూహంగా మెదడును నిలవగలమా?

నిండుగా హుందాగా వరుచుకున్న ఆ జలశరీరంమీద చల్లగా కాంతికిరణం జారినట్లు జారి మా వడవ ఒక ఒడ్డు వట్టింది. అక్కడ నుంచి దాదాపు ఒకటిన్నర మైలు నడిచి ఒక పూలతోటలో అడుగు పెట్టాం. నడిచేబాట అందంగా ఉంది. రెండు వక్కలా రకరకాల చెట్లు. పీచ్ చెట్లు మల్బరీ చెట్లు విరివిగా కనిపించాయి. అక్కడక్కడా యాపిల్ తోటలున్నాయి. తోటలున్నచోట మనుమల్నీ వశువుల్నీ ఆపేందుకు ముళ్ళకంచెలు అనగా మనవైపులాగా నాగజెముడూ కాకి జెముడూ పొదలుకావు. తుమ్మపొదలు గుచ్చపొదలూ అంతకంటేకావు, అన్నీ గులాబీపొదలు. కంచెకి పొడవునా విరబూసిన అడవి గులాబీగుత్తులు. ఎర్రగా తెల్లగా మెరిసే ఆ పువ్వులు చూస్తుంటే అతినంతుష్టుడైన వ్యక్తిహృదయంలా చూచే వాళ్ళ మనస్సుల్లో తృప్తిని ఘటిస్తున్నది. భగవత్సృష్టిలో ఎంత సుహత్తు. ఇళ్ళలో అతి జాగ్రత్తగా వంచప్రాణాలూ పెట్టి పెంచితే ఉండీ ఉండీ అవురూవంగా పూచే గులాబీలను ఇక్కడ ఏమాలి ఇంత విరివిగా పూయిస్తున్నాడు? ఆ పూవుల గుండెల్ని స్పందింవచేసి మనసారా విడిచి నవ్వినట్లుగా విరబూయించే కళాత్మకస్తం ఎవరిది? ఎలా దాన్ని వెదికి పట్టుకోవడం?

మెల్లిగా ఒక పూలతోటలోకి అడుగు పెట్టాం. దానిపేరు ''చష్మె షాహీ'' 'చష్మ్' అంటే ఊట అనీ 'షాహీ' అంటే శ్రేష్ఠమైనదనీ చెప్పారు అనగా దీన్ని ''రాయల్ స్ప్రింగ్'' అని ఇంగ్లీషు చెయ్యవచ్చు.

తెలుగులో గొప్పతోట, ఈ ఉద్యానవనం మనుములు వేసిందే, పర్వత పాద ప్రదేశంలో నెలకొని ఉంది. ఎత్తుపల్లాలుగా ఉన్న కొండవాలులో ఉండడంచేత తోటంతా ఎగుడు దిగుడుగా ఉంది. పర్వతం మీదనుంచి దిగివచ్చే క్రియ్యూటకాలువ ఒకటి తోటలోకి ప్రవహిస్తుంది. దానికో రాతిమండువా కట్టి నీరు నన్నని రాతి కట్టడంద్వారా కింది మండువాలోకి వచ్చిపడేట్టుగా అమర్చారు. అక్కడనుంచి కట్టిన కాలువలద్వారా నీరుతోటంతా ప్రవరిస్తుంది. ఆ జలం ఔషదప్రాయమైనదనీ దాన్ని తాగితే కడుపులో ఉండే కల్మషాలన్నీ కొట్టుకుపోతాయనీ ప్రతీతిరి. అక్కడ గుంపులుకూడి అందరూ తాగుతుంటే నేనూ తాగబోయాను. అనలిక్కడికి వచ్చాక దాహగుణం నశించింది. అన్నం తిన్నాక అదేదో అలవాటు ప్రకారం గొంతు తడుపుకోవడమేగాని మంచినీళ్ళు త్రాగాలన్న ఆసక్తిలేదు. ఆ నీళ్ళు నోట్లో పోసుకోగానే **ఇగంలా** చల్లగా పళ్ళు జిల్లుమనిపిస్తూ '**గళనాళిక**' నుంచి దిగజారేవి అక్కడి నీళ్ళన్నీ పర్వతోపరితాలాన మంచు కరిగిన నీళ్ళే. చుట్టూ ఎటుచూచినా దిద్దితీర్చిన గడ్డి వరువులు. అందులో పొదిగినట్లుగా క్రమంతప్పని పద్ధతిలో మిలమిలా. మెరిసే అనేకమైన రంగులలో పువ్వులు, అక్కడక్కడా ఏపుగా పెరిగి అందంగా మట్టననగా **పొక్తాతనం** నేర్చుకున్న కొత్త పెళ్ళి కూతుర్ధిలా ముచ్చటగా తోచే యాపిల్‌చెట్ల గుబురులు చెట్టునిండా యాపిల్‌పిందెలు దిగజారి పచ్చగా నిగనిగలాడుతూ చెట్టును మెరిపిస్తున్నయ్. చేతికందిన పిందెల్ని అటూ ఇటూ చూసి ఎవరూ గమనించడమూ మనది కాదనుకున్న దాన్ని ఎలా స్వంతం చేసుకోవాలనుకోవడమూ! పిందె కొరికితే దారుణమైన పిలుపు. నగం కాయైనా తినకముందే పళ్ళు పులిసిపోయాయి. కూడని చేత చేసినందుకు ఫలంగా లంచ్‌లో వాళ్ళు పెట్టిన నల్లటి కొయ్యబారిన చపాతీలు నమలలేకపోయాను.

ఆ తోటలోనుంచి బయటికి వస్తుంటే గాలి నీటివాననను మోసుకొని బరువుగా శరీరాన్నిస్పృశించడం మొదలుపెట్టింది. ఇక కొన్ని క్షణాలలో వానవస్తుందని తెలియజేయడానికి కాబోలు వాతావరణం చల్లగామారి మనసుల్ని పరవళ్ళు తొక్కించింది. తోట కుదురుకుని ఉన్న పర్వతపాదం వైపు చూస్తున్నాను. ఆ కొండ వెనకనుంచి పైఅంచులో వరునగా ఎన్నో కొండల చివళ్ళు ఎక్కిచూనత్తున్నట్లుగా కనిపిస్తున్నయ్. వాటిమీద మబ్బుల ముసుగు. ఆ ముసుగు చివళ్ళు కరుగుతూ పొగలా పరివ్యాపిస్తూ కిందికి దారాలు దారాలుగా జారడం మొదలైంది. అదే మబ్బు ధూమరూపంలో రింగులువారి వలయాలు చుట్టుకుంటూ గాలి వినురుకు కాబోలు, దూరంగా ఎగరకొట్టబడడం కనిపించింది. తర్వాత తొందరకత్తె అయిన ఇల్లాలు పనివేళ ఇంట్లో చేసే హడావుడిని తలపిస్తూ వానచినుకులు భూమిమీద చిటపటా రాలడం మొదలుపెట్టాయి. వానవల్ల ఎటూపోలేక కాసేపు అక్కడే ఉన్న టీ స్టాలులో ఆగి వేడి వేడి టీతో గొంతుకు హుషారు అందించి వేచి ఉన్నాము. మా అదృష్టవశంచేత కాసేపటికి వాన ఆగింది. మళ్ళీ నావల్లో నర్దుకుని నిషాత్‌బాగ్‌కు ప్రయాణమయ్యాము.

ఇది మరో సౌందర్య నదనం. నిషాత్ అంటే నంతోషమట! ఇటువంటి రమణీయప్రకృతి కళాఖండాలను చూస్తూ ఎవడు దుఃఖిత మనస్కుడై ఉండగలడు? ఇదీ పర్వతపాదప్రదేశంలో వేసిన తోటే! పర్వత పాదప్రదేశంనుండి భూమిమీదకు దిగేవాటివల్ల తోటంతా గట్లుగట్లుగా నిర్మితమైనట్లుగా ఉంటుంది. కొండమీదనుంచి కిందికిజారే 'జల' ఒకటి మనుష్యనిర్మిత **సోపానశ్రేణివెంట** కిందికి **ప్రవించి** తోటవాకిట **అంతర్ధానమై** ఎవరికీ కనిపించకుండా దాల్‌నరస్సులో అంతర్లీనమై పోతుంది. ఇక్కడనుంచి చూస్తే ఎదురుగా స్వచ్ఛంగా తళతళలాడుతూ భూమినంతా ఆక్రమించుకున్నట్లు పరుచుకున్న దాల్ నరస్సుయొక్క మనోహర సౌందర్యాన్ని తనివితీరా ఆస్వాదించవచ్చు.

తర్వాత చూసిన మరో విహారవనం 'చార్‌చినార్' ఇది చాలా చిన్నది. **ఆధునికంగా** కట్టబడ్డది. నాలుగు వక్కలా నాలుగు చినార్ చెట్లు ఉండడంవల్ల దీనికాపేరు. తోట మూడువైపులు పూర్తిగా నీళ్లలోకి చొచ్చుకొచ్చి బయటినుంచి చూసేవాళ్ళకు జలమధ్యంలో నిర్మితమైన వనంలా కనిపిస్తుంది. నీళ్ళలో తేలడానికై చుట్టూ చెక్కల కూర్పుతో నిలిపిన **నేలకట్టు**, ఆ వనం మొత్తం నీళ్ళల్లో తేలుతూ కించిత్తు ఊగుతున్నట్లుగా భ్రమ కల్పించడానికి కారణం.

తర్వాత షాలిమార్ తోటలవైపుకు పోదామని నిర్ణయించుకున్నాం. కాని అప్పటికే ఏడు దాటింది. అక్కడనుంచి ఎంతలేదన్నా గంటన్నర ప్రయాణం ఉందనీ, ఎనిమిది గంటలకల్లా తోట మూసేస్తారనీ చెప్పాడు బోటువాడు — అక్కడికా ప్రయాణం మానుకోవలసి వచ్చింది. తిరిగి వచ్చేటప్పుడు నంధ్యాకాంతి ప్రసరిస్తున్నప్పుడు నల్లని చీకటి తెరలు తెరలుగా నీటిమీద పరుచుకుంటున్నప్పుడు, దీపకళికలు వెలుగుల్లా మొగ్గల్లా నీళ్ళలో కదులుతున్నప్పుడు నరస్సు ప్రదర్శించే అందాన్ని ఆస్వాదిస్తూ మెల్లగా సాగించిన ఆ ప్రయాణం అద్భుతంగా ఉంది.

ఈ తోటలనన్నిటినీ మొగల్ తోటలంటారట. 1587 లో అక్బర్ కాశ్మీరాన్ని జయించి మొగలాయి పరిపాలన కిందికి దాన్ని తెచ్చాడు. ఆనాటినుండీ ఔరంగజేబు కాలంవరకూ ఆయా చక్రవర్తుల

రసపిపాసకు ఉదాహరణంగా ఆకృతిపొంది నిలిచిన తోటలివి. ఎక్కువగా వీటి నిర్మాణానికి కారణమైనవాడు షాజహాన్ చక్రవర్తి.

ఇంటికి వచ్చేటప్పటికి తొమ్మిది దాటింది. వంటవాడు పెట్టిన వేడి చపాతీలు తిని, అలసిన దేహాల్ని పొందిగ్గా రగ్గులకింద స్వెట్టర్లలోనూ అమర్చుకుని నిద్రకుపక్రమించాము.

## 15.3 పాఠ్య సారాంశం

ఉస్మానియా విశ్వవిద్యాలయంనుంచి నాయని కృష్ణకుమారి నేతృత్వాన ఒక విద్యార్థి బృందం కాశ్మీరానికి విజ్ఞానయాత్రకు బయలుదేరి 1967 జూన్ 18వ తేదీకి శ్రీనగర్ పట్టణానికి చేరుకున్నారు. శ్రీనగర్‌లో మకాంవేసి ఆ పట్టణాన్ని దర్శించారు. దాదాపు వెయ్యి అడుగుల ఎత్తున్న శంకరాచార్య పర్వతాన్ని అధిరోహించారు. ఈ కొండకు ఉత్తరాన మరోకొండ కనిపిస్తుంది. ఈరెండు కొండల మధ్యా శ్రీనగర్ పట్టణం విస్తరించి ఉంది. మధ్యలో జీలంనది ఉంది.

శ్రీనగర్‌లో ఉన్న సరస్సుల్లో తూర్పున ఉన్న దాల సరస్సు ప్రశస్తమైనది. స్ప్రింగు పరుపుల సీట్లతో విహారానికి ఎప్పుడులా సిద్ధంగా ఉంటాయి. నావికుడు కాక అయిదుగురు నావికులు ప్రయాణీకులు ఒక్కో నౌకలో కూర్చోవచ్చు. ఈ సరస్సు ఒక ఒడ్డునుంచి మరో ఒడ్డుకు నాలుగుమైళ్లు ఉంటుంది. ఈ బృందం నౌకావిహారం చేశారు. ఒక ఒడ్డుకు చేరుకున్నారు.

చష్మెషాహి చష్మె అనే పూలతోటకు వెళ్లారు. ఈ మాటకు అర్థం 'గొప్ప ఊట' అని. పర్వత ప్రదేశంలో ఉండటంవల్ల తోట ఎగుడుదిగుడుగా ఉంది.

అక్కడనుంచి మళ్లీ నావలో నిషాత్‌బాగ్ (సంతోషవనం) అనే మరో తోటకు వెళ్లారు. తోటంతా మెట్లు మెట్లుగా ఉంది. కొండనుంచి జారే జల ఒకటి ఈ మెట్లుమీదుగా దిగి దాల్ సరస్సులో కలిసిపోతుంది. ఈ తోటలో నుంచి చూస్తే దాల్‌సరస్సు దృశ్యం అందంగా ఉంటుంది.

తర్వాత చార్‌చినార్ అనే ఇంకో తోట చూశారు. నాలుగు పక్కలా చినార్ చెట్లు ఉండటంవల్ల దీనికాపేరు వచ్చిందంటారు. షాలిమార్ తోటలవైపు వ్యవధి లేకపోవటం వల్ల వెళ్ళలేకపోయారు. ఈ తోటలన్నిటినీ మొగల్ తోటలంటారు.

1587 లో అక్బర్ చక్రవర్తి కాశ్మీరాన్ని జయించి మొగల్ పరిపాలన కిందికి తెచ్చారు. మొగల్ చక్రవర్తులు ఈ తోటలకు కారకులు. ఎక్కువభాగం షాజహాన్ కాలంలో తయారైనవి. ఆ రోజున తమ యాత్రను ముగించి విద్యార్థిబృందం తమ విడిది గృహంలో విశ్రమించారు.

### ఆకళింపు ప్రశ్నలు —1

i) శ్రీనగర్ సౌందర్యాన్ని 25 పదాల్లో రాయండి.

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

ii) దాల్ సరస్సు నౌకా విహారానుభవాన్ని 50 పదాల్లో రాయండి

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

iii) మీకేదైనా యాత్రానుభవం ఉంటే ఆ అనుభవాన్ని 100 పదాల్లో రాసి చూపండి.

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

## 15.4 తెలుసుకోదగిన అంశాలు

కఠిన పదాలకు అర్థాలు తెలుసుకుందాం

ఈ రచయిత్రి ప్రాచీన సాహిత్య పరిచయంవల్ల ప్రాచీన భాషాపదాలూ, సంస్కృత పదాలూ కొన్ని వాడారు. సాహిత్య వచనంలో ఈ రకపు మాటలు ఎక్కువగా దొర్లుతాయి. అట్లాంటి మాటలకు అర్థాలు తెలుసుకోవటం అవసరం.

అధిరోహించు : పైకి ఎక్కటం, పర్వతాధిరోహణం అంటే కొండలు ఎక్కటం.

ఇగం : చలి, మంచు పల్లెటూళ్లలో ఈమాట వాడుకలో ఉంది. బాగా చలివేసినప్పుడు 'ఇగం కమ్మింది' అంటారు.

క్రియ్యాట : భూమిలోపలి నుంచి ఊరే నీటి ఊట. తెనాలి రామకృష్ణకవి రచించిన పాండు రంగ మాహాత్మ్యం అనే కావ్యంలో ఈ పద్యంలో ఈ మాట ఉంది.

ఏకమై కాలువలు గట్టి యేక హేల
ఒరవనందలి **క్రియ్యాట** పసిమితేట
పండునవ్వట ముక్కారు పసిడికాలు
సరసధాన్యంబు మంచి జనంపుజేల

గళనాళిక : గొంతు, కంఠనాళం

ఘటించి : కలిగించు, కూర్చు

నేలకట్టు : ఏదైనా ఒక కట్టడంలో అడుగుభాగం బేస్‌మెంటు. ఇది చాలా పాతమాట. తిక్కన రచించిన మహాభారతం విరాటపర్వంలో ఈ పద్యంలో ఈ మాట ఉంది. అడుగుల నునుకాంతి యయ్యెడ పద్మ రాగంబుల నేలకట్టు కరణి నొప్ప.

పడియ : పెద్దజలాశయాన్ని సరస్సు అంటారు. చిన్నవాటిని పడియలంటారు. నీటిపడియ అంటే నీటిగుంటలు అనవచ్చు.

పరివ్యాపించు : అధికంగా వ్యాపించు

పేపనజ్జ : పేము పుల్లలతో అల్లిన చిన్నబుట్టలను పూలసజ్జలు అంటారు.

పొత్తానం : ఇది ఉర్దూమాట. కుదిరిక, పొందిక.

ప్రశస్తమైన : శ్రేష్ఠమైన, మేలైన, ప్రశస్తమైన నగరం అంటే శ్రేష్ఠమైన పట్టణం అని అర్థం. అట్లాగే ఈ తోట ప్రశస్తంగా ఉంది అంటే ఈ తోట చాలబాగుంది, మేలుగా ఉంది అని అర్థం.

భాసించు : ప్రకాశించు, మెరయు, వెలుగు అని అర్థాలు.

రసపిపాస : సుందరమైన వస్తువులను, దృశ్యాలను, కావ్యాలను మొదలైన వాటిని ఆనందించాలనే కోరిక.

శిథిలాలు : గుడులు, కోటలు మొదలైన ప్రాచీనమైన కట్టడాలు కాలంలో పాడుబడిపోయి, విరిగి పడి ఉండిన గోడలను ఇతర భాగాలను 'శిథిలాలు' అంటారు. ఈ గుడి శిథిలమైనది అంటే ఈ గుడి పాతబడి, పాడుబడి, గోడలు విరిగిపోయినాయి అని అర్థం. దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఒక పాటలో 'శిథిలాలయమ్ములో శివుడు లేడోయి' అన్నారు. శిథిల అనే విశేషణం నుంచి శైథిల్యం అనే నామం వచ్చింది. పాడుబడ్డతనం అని అర్థం.

సోపానశ్రేణి : సోపానం అంటే మెట్టు, శ్రేణి అంటే వరస, మెట్ల వరస అని అర్థం. సోపానం అనే మాట ఏదైనా అందుకోటానికి క్రమమార్గం అనే అర్థంలో కూడా ఉపయోగిస్తారు. సాహిత్య సోపానాలు అంటే సాహిత్య పరిచయానికి క్రమపద్ధతులు అని అర్థం. పరమపద సోపానపటం ముక్తిని సాధించటానికి మెట్లు, (మార్గాలను) సూచించే బొమ్మ అని అర్థం.

స్రవించు : కారు, పారు, రక్తం ప్రవహిస్తున్నది అంటే నెత్తురు కారుతున్నది అని. గోదావరి స్రవిస్తున్నది అంటే గోదావరి పారుతున్నది అని.

2. సాహిత్య శైలి లక్షణాల నిరూపణ

ఎన్నో అంతర్భేదాలున్నా ఈ నాటి వచనాన్ని స్థూలంగా శాస్త్ర వచనం, సాహిత్య వచనం అని విభజించుకోవచ్చు. విషయ ప్రతిపాదన, వివేచన, విశదీకరణ శాస్త్ర వచనానికి ప్రధాన ప్రయోజనాలు. నిరాడంబరత, నిర్మమత్వం, అతివ్యాప్తి అవ్యాప్తులు లేకుండా పదాలూ,

వాక్యాలూ కూర్చటం శాస్త్ర వచనానికి ప్రధాన లక్షణాలు. చెప్పదల్చుకున్న విషయం నుంచి పక్కదారులు పట్టకుండా శాస్త్రవచనం రాసేవారు జాగ్రత్త పడతారు. శాస్త్రాన్ని సామాన్యులకు వివరించే చోట మాత్రం ఈ కట్టుబాట్లు కొంచెం సడలవుతాయి. సాహిత్యవచనం ఇందుకు భిన్నం. చెప్పేవిషయంకన్నా చెప్పే పద్ధతి ముందుకొస్తుంది. విషయం ఏంచెపుతున్నామని కాక ఎట్లా చెపుతున్నామనే దానిమీద దృష్టిఎక్కువ నిలుస్తుంది. అలంకార ప్రియత్వం, ఆవేశ ప్రకటనం, విషయాతిరిక్తమైన ఊహలు చెయ్యటం, పరిసర వస్తు సౌందర్యానికి పరవశం కావటం వంటి లక్షణాలు సాహిత్య వచనంలో కనిపిస్తాయి. సాధారణ వచనాన్ని సాహిత్య స్థాయికి పెంచే మార్గాలను అన్నివేళలా స్పష్టంగా పట్టుకోవటం కష్టమైనా కొన్నిటిని స్థూలంగా గుర్తుపట్టవచ్చు. ఈ వ్యాసంనుంచి అట్లాంటి మార్గాలను (devices) కొన్నిటిని ప్రదర్శిస్తున్నాం. పరిశీలించగలరు.

i) సౌందర్య దృష్టితో తరచుగా పోలికలుపయోగించటం.

ప్రపంచంలో ప్రతి వస్తువూ ఒక దానికన్నా ఇంకొకటి భిన్నమైనా కొన్ని వస్తువుల మధ్య కొన్ని సాదృశాలు కనపడతాయి. ఈ సాదృశాలను విషయ ప్రధానమైన శాస్త్రవచనంలో విషయ విశదీకరణకు వాడతారు. ఉదాహరణకు సూర్యుడి చుట్టూ భూమి తిరిగినట్టుగా పరమాణువులో కేంద్రకం చుట్టూ ఎలక్ట్రానులు తిరుగుతాయి. అనే వాక్యం తీసుకోండి. ఎలక్ట్రానులు కంటికి కనపడవు. పరమాణువులు కూడా కనపడవు. జాగ్రఫీ పాఠంలో బొమ్మల ద్వారా భూమిసూర్యుడి చుట్టూ ఒక కక్ష్యలో తిరగటాన్ని వివరిస్తారు. ఆ పోలిక చెప్తే ఎలక్ట్రానులు కేంద్రకం చుట్టూ కక్ష్యలో పరిభ్రమించటాన్ని ఊహించుకోవచ్చు. ఇందులో సౌందర్య దృష్టి లేదు. విశదీకరణ సౌకర్యం కోసం తెచ్చుకున్న పోలికే చూడండి.

"దాదాపు వెయ్యి అడుగుల ఎత్తున్న ఈ కొండ మీదనుంచి
చూస్తే శ్రీనగర్ అద్భుతంగా మన చుట్టూ చిన్నపిల్లల
కోసం నర్దిన బొమ్మల కొలువులా కనిపిస్తుంది"

ఈ పై వాక్యాన్ని చూడండి. ఎత్తైన ప్రదేశంనుంచి (కొండమీద నుంచి గాని, మేడమీద నుంచిగాని, విమానంలో నుంచిగాని) కిందికి చూస్తే వస్తువులు చిన్నవిగా కనిపిస్తాయి. ఈ దృశ్యం చాలామంది అనుభవం లోనిదే. కాని దీనికి "చిన్న పిల్లల కోసం నర్దిన బొమ్మల కొలువు"ను పోలిక చెప్పటంవల్ల మనం ఎక్కువ గ్రహించిందేమీ లేదు. పెద్దవస్తువులకు చిన్న సైజు ప్రాతినిధ్యం బొమ్మల్లో కనిపిస్తుంది. బొమ్మల కొలువుకు ఒక ఏర్పాటు (design) ఉంటుంది. అది త్వరగా కనిపిస్తుంది. పట్టణ నిర్మాణంలో ఏర్పాటును కూడా పైనుంచి చూడవచ్చు. ఈ పోలికలు అందం కోసం తెచ్చినవే కాని విషయ విశదీకరణకు తెచ్చినవికావు. అట్లాంటి పోలికలున్న మరికొన్ని వాక్యాలు ఈ వ్యాసం నుంచి తీసుకున్నవే, చూడండి.

ఈరెండు కొండలమధ్య విస్తరించిన జలం నదీ ప్రవాహం పన్నినే నీటి చారికల్లా కనిపిస్తుంది.

దాల్‌లేక్‌లో నౌకావిహారం చేస్తూ దారిచుట్టూ రమణీయంగా విప్పిన నెమలి పురిలో కన్నులు కుదురుకున్నట్లు గా అమరిన పూలతోటలు చూడటం ఆ వేళటి మా కార్యక్రమం".

ఈ పోలికల్లో ఎన్నో అవాంతర భేదాలను నిరూపించవచ్చు. అసలు వస్తువుకూ పోలిక తెచ్చుకున్న వస్తువుకూ ఉన్న లక్షణ, సామ్య, భేద, సంబంధాలను బట్టి ఈ భేదాలు ఉంటాయి. అలంకార

శాస్త్రంలో అసలు వస్తువును వర్ణ్యము (ఉపమేయము) అనీ, పోలిక తెచ్చుకున్న వస్తువును అవర్ణ్యము (ఉపమానము) అనీ అలంకార శాస్త్రంలో పిలుస్తారు. ఈ వ్యాసంలో కనిపించే కొన్ని పోలికలను రకాలను చూడండి.

ii) మూర్తవస్తువు (concrete), అమూర్త (abstract) వస్తువుతో పోలిక:

"ఎర్రగా తెల్లగా మెరిసే ఆ పువ్వులు చూస్తుంటే అతి సంతుష్టుడైన వ్యక్తి హృదయంలా చూచేవాళ్ల మనస్సుల్లో తృప్తిని ఘటిస్తున్నది.

ప్రకృతి సంఘటనకు మానవ చేష్టలతో పోలిక

"తొందరకత్తె అయిన ఇల్లాలు పనివేళ ఇంటో చేసే హడావిడిని తలపిస్తూ వానచినుకులు చిటపటా రాలడం మొదలుపెట్టాయి."

చిటపటా అనే రకపు మాటలను భౌతిక శబ్దాలను భాషలో అనుకరిస్తాయి గనుక వాటిని ధ్వన్యనుకరణ శబ్దాలంటారు. 'చిటపట' అనే ధ్వన్యనుకరణాన్ని పై రెండు సందర్భాల్లోనూ వాడటం వల్ల ఈ వాక్యంలో ఈ శబ్దం చమత్కార కారకమవుతున్నది.

మానవేతర వస్తువుకు మనిషితో పోలిక

"శ్రీనగరానికి తూర్పు దిశనున్న ఈ సరస్సు కావలివైపున పర్వతశ్రేణి నిటారుగా నిల్చొని సరస్సు అందాన్ని తదేకంగా పరికిస్తున్న రసహృదయుడైన వ్యక్తిలా కనిపిస్తుంది."

కదలని కొండతో పోలుస్తున్నందువల్ల 'తదేకంగా' అనే విషయం విశేషణం సార్థకంగా ప్రయోగించారు రచయిత్రి.

iii) సాహిత్యంలో నలుగుడు పడ్డ ప్రాచీన భాషా పదాలు సంస్కృతం మాటలూ, సాధారణ శబ్దాలకు బదులుగా వాడటం: ఘటించు, భాసించు, స్రవించు అనే క్రియలూ, క్రియ్యూట కాలువా, నేలకట్టు, సోపానశ్రేణి అనే నామాలు ఈ దృష్టితోనే ఈ పాఠంలో వాడబడినట్టు గమనించవచ్చు; చూడండి:

"మనస్సుల్లో తృప్తిని ఘటిస్తున్నది."

ఇక్కడ కలిగిస్తున్నది అనేది సాధారణంగా వాడే మాట.

'ఆ పర్వత శరీరచ్ఛాయ నీళ్లలో ప్రతిబింబిస్తూ గాఢ నీలవర్ణంతో భాసించే నీటిలో.....'

ఇక్కడ మెరిస్తే అనేది సాధారణంగా వాడేమాట.

'కొండమీద నుంచి కిందికి జారే జల ఒకటి మనుష్య నిర్మిత **సోపానశ్రేణి వెంట** కిందికి **స్రవించి.....**

ఇక్కడ మనుషులు కట్టిన మెట్ల మీదనుంచి కిందికి పారి" అని రాసినా అర్థంలో మార్పుండదు. అట్లాగే క్రియ్యూట కాలువ, నేలకట్టు అనే మాటల ప్రయోగాన్ని కూడా పరిశీలించండి.

iv) సుందర దృశ్యాలను చూసినప్పుడు మనసుపొందికను ఉద్వేగాన్ని ప్రకటించటం.

"ఈ రమణీయకం ఇలా శాశ్వతంగా కళ్లముందు ఎటువంటి వికృతత్వాలనూ పొందకుండా నిలిచిపోతే, ఈ అనంత ప్రకృతి శ్రీ సంపదను అనుక్షణమూ అనుభవించడానికి ఇప్పుడున్న స్థితిలోనే అజరామరమైన అమృతత్వాన్ని పొందగలిగితే! ఎన్ని ఊహలు!

దాల్ సరస్సులో ప్రయాణిస్తున్నప్పుడు పరిసర రమణీయకానికి స్పందించి పొరిదిన ఉద్వేగాన్ని అప్పుడు మెదిలిన ఊహలను రచయిత్రి ఇక్కడ అక్షరీకరించారు.
దృశ్య దర్శక స్థితి ఎంత రమణీయమైనా, ఎంతకొరదగిందయినా శాశ్వతం కాదు. అది రచయిత్రికి తెలును. అయినా ఊహలను శాసించటం కుదరదుకదా! అందుకని రచయిత ఈ రమణీయయకం శాశ్వతమైన స్థితిని ఊహల్లో ఊహించి ఉద్వేగాన్ని పొందుతున్నారు రచయిత్రి.

v) సందర్భాన్నిబట్టి కొన్ని తాత్విక చింతనలు, అజ్ఞాత (unknown) అదర్శనీయ (unseen) వస్తువుల గురించి చేసే ఊహలు సందర్భాన్నిబట్టి సాహిత్య స్థాయికి చేరతాయి.

భగవత్సృష్టిలో ఎంత మహత్తు!
ఇళ్లలో అతి జాగ్రత్తగా పంచప్రాణాలూ పెట్టి
పెంచితే ఉండీ ఉడిగ అపురూపంగా
పూచే గులాబీలను ఇక్కడ ఏమాలి .

ఇంత విరివిగా పూయిస్తున్నాడు?
ఆ పూవుల గుండెల్ని స్పందింపజేసి
మనసారా వావిడిచి నవ్వినట్లుగా
విరబూయించే కళాత్మక హస్తం ఎవరిది?
ఎలా దాన్ని వెతికి పట్టుకోవడం?

పై వాక్యాల్లో మనకు అపురూపంగా కనిపించే గులాబీలు కాశ్మీరంలో విరివిగా కనపించటంతో ఆశ్చర్యం చెందిన రచయిత్రి వీటి అస్తిత్వానికి అజ్ఞాతకర్తను ఊహించి రచయిత్రి తాత్విక స్థాయిలో ప్రకటించారు.

vi) పరిసర సౌందర్యానికి పరవశమై చేసే స్వాభావిక వర్ణనలు వచనానికి సాహిత్య స్థాయిని కూరుస్తాయి. ఉదాహరణకు ఈ వర్ణన చూడండి.

తెరిగి వచ్చేటప్పుడు సంధ్యాకాంతి ప్రసరిస్తున్నప్పు డు
నల్లని చీకటి తెరలు తెరలుగా నీటిమీద పరుచు
కుంటున్నపుడు దీపకళికలు వెలుగుల్లా, మొగ్గల్లా
నీళ్లలో కదులుతున్నప్పుడు సరస్సు ప్రదర్శించే
అందాన్ని ఆస్వాదిస్తూ మెల్లిగా సాగించిన ఆ
ప్రయాణం అద్భుతంగా ఉంది.

ఈ పై వాక్యాల్లో చీకటి పడుతున్నప్పుడు దాల్ సరస్సులో కడితే పడవల దీపకళికలూ, అవి నీళ్లల్లో ప్రతిఫలించినప్పుడు కనిపించే సరస్సు అందాలు ఈ పై పేరాలో రచయిత్రి వర్ణించారు. ఈ వర్ణనలు ఈ వచనాన్ని సాహిత్య వచనంగా మార్చాయి.

**ఆకళింపు ప్రశ్నలు 2**

i) ఈ కింది మాటలను సాహిత్య స్థాయి వచనంలో కూర్చండి.

| మాట | సాహిత్య స్థాయి వాక్యం |
|---|---|
| అధిరోహించు | |
| ఇగం | |
| ఘటించు | |
| భాసించు | |
| శిథిల | |
| సోపానాలు | |

ii) ఈ కింది పోలికలను సాహిత్య దృష్టితో 25 పదాల్లో విమర్శించండి.

అ నగరం మొత్తం పడియలు పడియలుగా మధ్యలో పచ్చని నేల ముక్కలు అతికినట్టు నన్నని కాలువలు తీసినట్లు తెల్లగా శుభ్రంగా మెరిసే దారులవెంట బొమ్మరిళ్లు నిలిపినట్లు వింతగా కనపడుతోంది.

..............................................................................................
..............................................................................................
..............................................................................................
..............................................................................................
..............................................................................................
..............................................................................................

ఆ. ఎక్కడ చూసినా వెండిరేకలులా తళతళలాడే నీటి ఉపరితలం.

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

ఇ. ఆ నీటి తుళ్లింతలకు చుట్టువక్క చిన్న చిన్న కెరటాలు ఏర్పడి చూస్తుండగనే దూరంగా తప్పటడుగులు వేసుకుంటూ వెళ్లిపోయే పసిపిల్లల చిన్న పాదాల్లా జరిగిపోవడం మొదలు పెట్టాయి.

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

ఈ. నిండుగా హుందాగా పరచుకున్న ఆ జల శరీరం మీద చల్లగా కాంతికిరణం జారినట్లు జారి మా పడవ ఒక ఒడ్డు పట్టింది.

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

iii) ఈ కింది వర్ణనను సాహిత్య దృష్టితో 25 పదాల్లో వ్యాఖ్యానించండి.

ఆకాశం. స్వచ్ఛంగా ఉన్నప్పటి ప్రతిఫలనంలో ఒక అందం. దూరంగా ఉన్న కొండ నీళ్లల్లో తొంగి చూచినప్పుడు పక్కగా పోయే మరో షికారా నీడ నీళ్లలో హుందాగా కదలాడినప్పుడు, అన్ని సమయాల్లోనూ ఆ వినీల గంభీర సరోవరంలో మనసులో ఉపోవలయాల్ని రేపి అందుకోలేని అందాన్ని స్వంతం చేసుకోలేని ఆ రమణీయకాన్ని ఆలోచిస్తూ తృప్తి చెందమని ఆదేశించింది.

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

**అభ్యాసాలు చేయండి.**

**కాశ్మీర దీపకళికలోని శైలిని గురించి 50 పదాల్లో రాయండి.**

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

## 15.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం.

- శ్రీనగర్ పట్టణం, దాల్ సరస్సు, చష్మెషాహి అనే పూలతోట దిషాత్‌బాగ్, చార్‌చినార్ యాత్రా చరిత్ర పాఠ్యం.
- ఈ పాఠ్యంలోని కృష్ణకుమారి శైలి అలంకార ప్రియత్వంతో, ఆవేశ ప్రకటనతో, విషయాతిరిక్తమైన ఊహలతో కూడుకున్నది. సౌందర్య పారవశ్య జనితమైన సాహిత్య వచనం ఆమెది.

### అభ్యాసాలకు మాదిరి జవాబులు

నాయని కృష్ణకుమారి కాశ్మీర దీవకళికలోని శైలి సాహిత్య వచనశైలి. చెప్పిన విషయం మీద కంటే చెప్పే పద్ధతి మీద రచయిత్రికి దృష్టి ఎక్కువని ఆమె వాడిన అలంకార భాష ద్వారా గ్రహించవచ్చు. ఆమె రచనలో ప్రాచీన కావ్యభాషావదాలు కన్పిస్తాయి. ఉదాహరణకు ఘటించు, భాసించు, నేలకట్ట మొదలైనవి. పరిసరాల సౌందర్యానికి వరవశమై ఆవేశం పొందినప్పుడు రచయిత్రి శైలిలో స్వాభావిక వర్ణనలు చోటుచేసుకున్నాయి.